డా॥ బి.వి. పట్టాభిరామ్ Ph.D

# గుడ్ పేరెంట్ + బెటర్ టీచర్ = బెస్ట్ స్టూడెంట్

ఎమెస్కో

## ఇందులో...


| | |
|---|---|
| మారవలసిన విలువలు | 5 |
| పిల్లల్లో స్ఫూర్తి ఎలా కలిగించాలి? | 11 |
| విలువల పతనానికి బాధ్యులెవరు? | 17 |
| టీచర్ అంటే ఎలా ఉండాలి? | 23 |
| తల్లిదండ్రులకు నూటొక్క చిట్కాలు | 28 |
| తస్మాత్ జాగ్రత్త | 42 |
| పెద్దలకు పరీక్షలు | 43 |
| మంత్రాల్లాంటి మాటలు | 49 |
| పరీక్షల టెన్షన్ తగ్గాలంటే...! | 55 |
| ర్యాగింగ్‌ను ఎదుర్కోవడమెలా? | 61 |
| వద్దన్నా చేయాలనిపించే ఓ.సి.డి. | 67 |
| తలరాతను తలదన్నేదే చేతిరాత | 72 |
| భయాన్ని అధిగమిస్తే జయం మీదే! | 77 |

# మారవలసిన విలువలు

1980 లో ఢిల్లీ తెలుగు సంఘం వారు ఏర్పాటుచేసిన ప్రదర్శనలో ముందు ఒక యువకుడు కవిత చదివాడు. అది ఇప్పటికీ మర్చిపోలేదు. చదివితే మీరుకూడా మర్చిపోలేరు. నీతి నిజాయితీగా ఉండే ఒక పోలీసు ఆఫీసరుకి చల్లటి బీరు తాగాలనిపించిందట. అదేమంత పెద్ద విషయం కాదు కానీ, తన తండ్రి నేర్పిన విలువలను కాపాడాలని ఆ కోరిక వాయిదా వేస్తూవచ్చాడు. చివరకు ఉండబట్టలేక ఒకరోజు తాగాలని నిర్ణయించుకున్నాడు.

తాగేముందు పేపరు తిరగేశాడు. అందులో “అత్తగారు దహనం చేసిన కోడలు” అనేవార్త చదివి, మనసు వికలమై మర్నాడు తాగాలనుకున్నాడు.

ఆరోజు పేపర్లో కూడా “కూతురిని కాటేసిన తండ్రి”వార్త ఉంది. మళ్ళీ మర్నాటికి వాయిదావేశాడు.

ఆరోజు “కట్నానికి నవవధువు బలి” వార్త ఉంది. దాంతో అతనొక నిర్ణయం తీసుకున్నాడు.

ఏరోజైతే పేపర్లో అటువంటి వార్త ఉండదో ఆరోజే తాగాలనుకున్నాడు. అలా ఒక ఆరునెలలు గడిచింది. ప్రతీరోజు అలాంటి వార్తలే. ఒకపత్రికలో ఇటువంటి నేరాలకు ఒక కాలమ్ కూడా కేటాయించారు. ఆరునెల్ల తర్వాత

ఒకరోజు పేపర్లో అటువంటి వార్తలేదు. ఆశ్చర్యంతో పేపరంతా తిరగేశాడు. అయినా అటువంటి కేసు జరిగిన దాఖలాలేవీ లేవు. దాంతో ఆనందంగా ఫ్రిజ్‌లో ఆరునెల్లనుండి దాచిన బీర్ బాటిల్ మూతతెరిచాడు. ఇంతలో బెడ్‌రూమ్‌లోంచి అరుపులు వినబడ్డాయి. అతని తల్లి పరిగెత్తుకుంటూ వచ్చి

"చూడరా నీ భార్య ఏంచేస్తోందో! వాళ్ళ నాన్న ఇస్తానన్న స్కూటరు ఎందుకివ్వలేదని గట్టిగా అడిగేసరికి, వంటిమీద కిరసనాయిలు పోసుకుని కాల్చుకుంది" అంది.

## ఆక్సియాలజీ (AXIOLOGY)

ఆక్సియాలజీ అంటే మానవతా విలువల శాస్త్రం. గ్రీకు భాషలో "ఆక్సియా" అంటే "ఆచరించదగ్గ విలువలు' అని అర్థం. ప్రతి వ్యక్తి కుటుంబంలో, సమాజంలో ఆచరించవలసిన కొన్ని విలువలు ఉన్నాయి. ప్రతి వ్యక్తి కుటుంబంలో తన స్థానాన్ని బట్టి ప్రవర్తించవలసిన అవసరం ఉంది. అతను తన తండ్రితో మాట్లాడినపుడు కుమారుడిగా, భార్యతో మాట్లాడినపుడు భర్తగా, చెల్లితో మాట్లాడినపుడు అన్నగా, అన్నతో మాట్లాడినపుడు తమ్ముడిగా, కూతురితో మాట్లాడినపుడు తండ్రిగా ఉండాలి. దానికి తగినట్లుగా బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలి. ఆవిధంగా ఎవరి బాధ్యతలను వారు నిర్వహిస్తూ, నీతి నిజాయితీగా ఉన్ననాడు సమాజంలో ఇన్ని నేరాలు, ఘోరాలు ఉండవు.

ఇది చదివి "ఇది మనదేశంలో ఇప్పట్లో సాధ్యంకాదు" అనిపెదవి విరచకండి. కనీసం కొంతమందైనా ఇది పాటించగలిగితే విజయంసాధించి నట్లే "కొండ అద్దమందు కొంచెమై ఉండదా, విశ్వదాభిరామ వినురవేమ" అన్నట్లుగా ఉదాహరణకు భార్యతో మాట్లాడినపుడు, ఆమె తండ్రిని, తల్లిని విమర్శిస్తే అది వింటున్న కొడుకు కూడా తరువాత అదే బాటలో ప్రవర్తించవచ్చు. తండ్రి చిన్న తప్పు చేస్తే, కొడుకు పెద్ద తప్పు చేయవచ్చు. తప్పు ఏదైనా ఒకటేకదా! అటువంటి కొడుకులవల్ల సమాజం భ్రష్టు పట్టవచ్చు.

ఆ కొడుకు రేపు బస్సులోనో, రైల్లోనో ప్రయాణిస్తూ, పెట్రోలు పోసి ప్రయాణికులను తగలెట్టవచ్చు. రేపు తన కూతురిని రేప్ చేయవచ్చు. ప్రార్థనామందిరంలో బాంబులు వేయవచ్చు. లేదా రెండు మతాలమధ్య చిచ్చు పెట్టి సరదాగా చూస్తుండవచ్చు. కాబట్టి ఇటువంటి సమయంలో నైతికధర్మాలు, విలువలగురించి కొందరైనా పట్టించుకోవడం అవసరం.

## తల్లిదండ్రులే మార్గదర్శకులు

డాక్టర్ రాబర్ట్ హార్ట్‌మన్ అనే వ్యక్తిని మోడరన్ ఆక్సియాలజీకి పితామహుడిగా సైకాలజిస్టులు గుర్తిస్తారు. ఆయన ఈ శాస్త్రం గురించి ఎన్నో గ్రంథాలు రాశారు. ఎందరినో బాగు చేశారు. ఆయన ఉద్దేశంలో పిల్లలకు సరైన మార్గం బోధించేవారు తల్లిదండ్రులేనంటాడు. పిల్లల ముందు బంధువులను, టీచర్లను విమర్శిస్తే వారు కూడా అదే పద్ధతిలో విమర్శించవచ్చు. తల్లిదండ్రులు పిల్లలను ప్రతిదానికి విమర్శిస్తే పెద్దయ్యాక ఎదురుతిరగవచ్చు. చిన్నతనంలో అతిగా భయపెడితే పెద్దయ్యాక పిరికివాడు కావొచ్చు. అవమానిస్తే నలుగురిలో కలవలేకపోవచ్చు. పొగిడితే ఇతరులను అభినందించే గుణం అలవర్చుకోవచ్చు. ఎంకరేజ్ చేస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇటువంటి సత్యాలను తల్లిదండ్రులు గుర్తించాలని అంటారు రాబర్ట్ హార్ట్‌మన్.

## శివుడి మేనేజిమెంట్

ఒక తండ్రి తన పిల్లలు చిన్నవారిగా ఉన్నప్పుడు పేదలపట్ల దయతో ఉన్నాడనుకోండి. ఆ పిల్లలుకూడా అదే భావన పెంచుకోవచ్చు. అదే తండ్రి పేదలను “వీళ్ళు దొంగలు, వళ్ళువంచి పనిచేయక ఇలా అడుక్కు తింటున్నారు” అంటే, పిల్లలు పెద్దయ్యాక పేదలను అణగదొక్కవచ్చు. తల్లిదండ్రులు రోజూ తమ విరామసమయంలో పిల్లల్తో కబుర్లుచెప్పడం, ఇల్లుసర్దడం, చెట్లకు నీళ్ళు పోయడంవంటివిచేస్తే, పిల్లల్లో కూడా ఆ అలవాట్లు వస్తాయి. చిన్నప్పుడు